క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కోవూరు: కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో బుచ్చిరెడ్డిపాళెం రూరల్ సీఐ సుబ్బారావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అంబేడ్కర్ – సాంఘిక న్యాయం అనే అంశంపై జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని చెల్లాయపాళేనికి చెందిన విద్యార్థి సాహిత్య ఉత్తమ ప్రతిభ చూపింది. ఈ క్రమంలో గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హరినారాయణన్ చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసపత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

సీఐకు ఐజీ పరామర్శ

నెల్లూరు(క్రైమ్): నాయుడుపేట – పూతలపట్టు జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాపట్ల జిల్లా మార్టూరు సీఐ అక్కేశ్వరరావును గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు శనివారం పరామర్శించారు. సీఐ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కులం పేరుతో దూషించి.. ఆపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఎందుకు మోసం చేశారని నిలదీసిన తల్లీకుమార్తెను కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనలో నిందితులపై బాలాజీనగర్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని కుసుమ దళితవాడలో నివాసం ఉంటున్న కామాక్షికి నగరానికి చెందిన అనూష, రఘువర్దన్‌తో పరిచయం ఉంది. బంగారం వ్యాపారంలో నగదు పెడితే రెండింతలు తిరిగిస్తామని వీరు కామాక్షిని నమ్మించారు. వీరి మాటలను విశ్వసించిన ఆమె రూ.8 లక్షలను ఇచ్చారు. నెలలు గడుస్తున్నా అనూష, రఘువర్దన్ ఆమెకు నగదును ఇవ్వలేదు. దీంతో కామాక్షి తన తల్లితో కలిసి హరనాథపురం వద్ద అనూష, రఘువర్దన్‌ను ఈ నెల 21న నిలదీశారు. ఆగ్రహానికి గురైన వారు తమ స్నేహితులు సుకుమార్, రవిరెడ్డి, ప్రసన్నతో కలిసి కామాక్షి, ఆమె తల్లిని కులంపేరుతో దూషించి దాడి చేశారు. ఈ మేరకు పోలీసులకు కామాక్షి ఫిర్యాదు చేశారు. నిందితులపై దాడి, ఎస్సీ, ఎస్టీ కేసును ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ నమోదు చేశారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు నమోదుకు మరో అవకాశాన్ని కల్పించారని, అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లతో నగరపాలక సంస్థ కార్యాయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు కార్డులోని తప్పులను సరిదిద్దుకునేందుకు సైతం అవకాశం ఉందన్నారు. ఓటు నమోదు, మార్పులు.. చేర్పులు కోసం చేసుకున్న దరఖాస్తులను బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏఈఆర్‌ఓలు దేవీకుమారి, నిర్మలానందబాబా, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పటిష్ట చర్యలు

నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలోని 33వ డివిజన్ వెంగళరావునగర్, నేతాజీనగర్ ప్రాంతాల్లో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని మేయర్ స్రవంతి ఆదేశించారు. డివిజన్లోని ఆరో వీధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్‌ను వేయడంతో పాటు మలాథిన్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

పొదలకూరు అభివృద్ధికి రూ.73 కోట్లు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: పొదలకూరు పంచాయతీకి వివిధ నిధుల ద్వారా రూ.73.35 కోట్లను కేటాయించి అభివృద్ధి పనులను చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రూ.43.6 లక్షలతో సచివాలయ బిట్ – 3 భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనాలను శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీలో నాలుగు సచివాలయ భవనాలతో పాటు వాటికి అనుసంధానంగా నాలుగు రైతు భరోసా కేంద్ర భవనాలను నిర్మించామని తెలిపారు. పట్టణంలో సిమెంట్ రోడ్డు, ఆర్ అండ్ బీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, జగనన్న కాలనీలు, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులను భారీగా వెచ్చించామని వివరించారు. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. తొలుత అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని మంత్రికి ఘన స్వాగతం పలికారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెదమల్లు రత్నమ్మ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఏఓ గీతాకుమారి, పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న చేరికలు

సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. పట్టణానికి చెందిన 25 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు, నేతలు పొదలకూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేఆర్ ఆర్‌నగర్‌కు చెందిన పోలిశెట్టి గోపాల్, బండి బ్రహ్మయ్య, నీలం అంకయ్య, నీలం ప్రసాద్, మణి, వెంకటేష్, శారద, బండి లక్ష్మి, బండి ఆదిలక్ష్మమ్మ, రమణమ్మ, దేవి తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, అంజద్, వాకాటి శ్రీనివాసులురెడ్డి, శేఖర్‌బాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని సర్వేపల్లి ప్రజలు నమ్మే ప్రసక్తే లేదు



వెంకటాచలం: వరుస ఓటములతో రాజకీయాల్లో చెత్త రికార్డును మూటగట్టుకున్న సోమిరెడ్డిని సర్వేపల్లి ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాలిచెర్లపాడుకు చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరారని సోమిరెడ్డి ప్రకటించారు. అయితే వీరు మంత్రిని నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పాలిచెర్లపాడులో సోమిరెడ్డికి కనీసం ఫ్లెక్సీ కట్టే గతి సైతం లేదన్నారు. టీడీపీలో భారీ చేరికలంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. సోమిరెడ్డి మరోసారి ఓటమిపాలవుతారని సొంత పార్టీ నేతలే బహిరంగంగా చెప్తుండటంతో, ఆయన మతిభ్రమించి వింత పోకడలు, వికృత చేష్టలతో రోజురోజుకూ దిగజారుతున్నారని చెప్పారు.

వినియోగంలోకి ఆర్వో ప్లాంట్



ముత్తుకూరు: మండలంలోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో పాడై మూలనపడిన ఆర్వో ప్లాంట్‌ను బాగుచేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఆర్వో ప్లాంట్‌ను గతంలో ఏర్పాటు చేశారు. అయితే పరికరాలు దెబ్బతినడంతో ప్లాంట్ మూలపడింది. తాజాగా అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు ఈ ప్లాంట్ దుస్థితిని పరిశీలించి బాగుచేసేందుకు పూనుకున్నారు. అవసరమైన రిపేర్లు చేయించి వినియోగంలోకి తీసుకురావడంతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కబడ్డీ జట్టుకు అభినందన



కొడవలూరు: ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్నార్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెం బాలికల జట్టు విజేతగా నిలిచింది. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టును సర్పంచ్ నవీన్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. వీరికి ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ చెంతాటి సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు బత్తల మధుసూదన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

30న ఆసరా చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మనుబోలు: ఆసరా చెక్కులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 30న పంపిణీ చేయనున్నామని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం సీసీలతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. ఏపీఎం వనజాక్షి, సీసీలు జయమ్మ, దేవమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సుబ్రహ్మణ్యం

కొడవలూరు: ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన అవసరమని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కొడవలూరులోని మూలకట్ల గిరిజన కాలనీలో ప్రభుత్వ పథకాలపై ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అవగాహన లేకపోవడంతో పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. చిన్నారులను బడికి పంపడం ద్వారా జగనన్న గోరుముద్దతో పాటు యూనిఫారాలు, పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ మనోజ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఏఆర్డీ సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, హుస్సేన్, పావని పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం



కోవూరు: పట్టణంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన మొబీనా సుల్తానా గతేడాది పదో తరగతి పరీక్షల్లో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో పాఠశాలలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్రుడి వెంకటరమణయ్య – అన్నపూర్ణమ్మ స్మారక సంస్థ ఆధ్వర్యంలో రాచపూడి వెంకటరంగారావు స్మారక బహుమతి కింద విద్యార్థినికి రెండు గ్రాముల బంగారు పతకాన్ని అందజేసి, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ న్యాయమూర్తి నిరంజన్ మాట్లాడారు. ఈ ఏడాది నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రెండు గ్రాముల బంగారు డాలర్‌ను అందజేస్తామని ప్రకటించారు. అనంతరం నిరంజన్‌ను సత్కరించారు. మాలకొండయ్య, ఉమాసుందరి, ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నానికి మంత్రి రాక నేడు

ముత్తుకూరు: కృష్ణపట్నం గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంతో పాటు శంకుస్థాపనలను మంత్రి చేపట్టనున్నారని చెప్పారు.

ఆటో బోల్తా

• ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: ఆటో బోల్తాపడటంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరుకు చెందిన ఫయాజ్, సోనీ పని నిమిత్తం ఆటోలో కసుమూరు వచ్చారు. తిరిగి వెళ్తుండగా, మలుపు రోడ్డు వద్ద ఎదురుగా టిప్పర్ రావడంతో ఆటో బోల్తా పడింది. ఘటనలో గాయపడిన ఫయాజ్, సోనీని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

పొదలకూరు: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ముదిగేడు పొలాల్లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, విద్యుత్ అధికారి సమాచారం మేరకు.. సైదాపురం మండలం మలిచేడుకు చెందిన దేవరాల చిన్నబ్బయ్య (70) ముదిగేడులోని సవకతోట వద్దకొచ్చి నీరు పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పొదలకూరు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కనులపండువగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో కొలువైన లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను కనులపండువగా శనివారం నిర్వహించారు. విశేషాలంకారంలో స్వామి, అమ్మవారు దర్శనమిచ్చారు.

ఆలయంలో చోరీ



మనుబోలు: మండలంలోని అక్కంపేటలో గల రామాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి శుక్రవారం రాత్రి పాల్పడ్డారు. తాళాన్ని పగలగొట్టి లోపలికి ప్రవేశించి సీతమ్మ మెడలో ఉన్న బంగారు మంగళసూత్రం, వెండి జంధ్యం, హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. ఎస్సై అజయ్‌కుమార్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి



సీఎంపై అభిమానంతో మహిళలు తీర్చిదిద్దిన ముగ్గు

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: మహిళలు ఆర్థికంగా బలోపేతం చెంది.. స్వయం ఉపాధి దిశగా అడుగులేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రుక్మిణీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన ఆసరా నగదు పంపిణీ కార్యక్రమానికి అక్కాచెల్లెమ్మలు వేలాదిగా హాజరయ్యారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను జేసీ కూర్మనాథ్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడతలో 892 సంఘాలకు రూ.6.83 కోట్లను అందజేశారని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చర్యలు చేపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయకుమార్, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఏసీ శ్రీలత, ఏపీఎం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. పది అంశాలను ప్రవేశపెట్టగా, అన్నింటినీ కౌన్సిల్ సభ్యులు ఆమోదించారని చెప్పారు. 2023 – 24కు సంబంధించి సవరించిన బడ్జెట్.. 2024 – 25 సంవత్సర వార్షిక బడ్జెట్ అంచనాలను ప్రవేశపెట్టారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్పయాగం పోస్టర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ఫిబ్రవరి రెండు నిర్వహించనున్న పుష్పయాగ పోస్టర్లను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. నెల్లూరులోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భక్తులు భారీగా తరలిరావాలని కోరారు. ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగదేవిపేటలో సాంకేతిక ప్రదర్శన, రైతు సదస్సు



ఇందుకూరుపేట: వ్యవసాయ కళాశాల విద్యార్థులకు క్షేత్రస్థాయిలోని అనుభవాలు ఎంతో ఉపయోగపడతాయని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేటలో ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన – రైతు సదస్సును మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పంటల సాగులో ఆశించే తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఏపీ ఫైబర్‌నెట్ సేవలు



ఇందుకూరుపేట: తక్కువ ధరకే ఏపీ ఫైబర్‌నెట్ సేవలను అందిస్తున్నామని సంస్థ మార్కెటింగ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో కేబుల్ ఆపరేటర్లతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను ఆపరేటర్లకు వివరించారు. అనంతరం అధికారులు సింహాద్రి, రమేష్‌రెడ్డి మాట్లాడారు. ఇంటర్నెట్ సేవలను రూ.190, రూ.249కే అందిస్తున్నామని వివరించారు. ఇందుకూరుపేట కేబుల్ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కోవూరు: చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహనను పెంపొందించుకోవాలని సీఐడీ సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చట్టాలు తదితర అంశాలపై కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సీఐడీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించేలా అన్ని మండలాల్లో సదస్సులను నిర్వహిస్తున్నామని వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఏఎస్‌ఈబ్ల్యూ తిరుపతయ్య ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ, సంక్షేమాధికారులు వెంకట్రావు, పద్మ, సుప్రజ, సీఐడీ ఎస్సై షాజహాన్, రాఘవేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.